క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం



స్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువుదీరిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో రుత్వికులు స్వామికి విశేష పూజలు జరిపారు. అలాగే స్వామికి శాంతి కల్యాణ మహోత్సవం జరిపారు. స్వామి కల్యాణంలో భక్తులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నసమారాధన చేశారు.

గజమాల యాత్ర కమిటీతో సమీక్ష

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్ర కమిటీ సభ్యులతో రాజోలు సీఐ గోవిందరాజు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 19న రాజోలు తాలూకా అగ్నికుల క్షత్రియ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గజమాల యాత్ర కొపనాతి కృష్ణమ్మ స్వగ్రామం ఓడలరేవు నుంచి ప్రారంభవుతుందని కమిటీ అధ్యక్షుడు చింతా మహానాగరాజు వివరించారు. పేరూరు, మామిడికుదురు, తాటిపాక, పొదలాడ, రాజోలు, మలికిపురం మీదుగా అంతర్వేది వరకు గజమాల యాత్ర కొనసాగుతుందన్నారు. అంతర్వేది విచ్చేసే భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా యాత్ర చేపట్టాలని సీఐ సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలన్నారు. కమిటీ ప్రతినిధులు తిరుమాని రాజు, రామకృష్ణ, కాటాడి ఉమా మహేశ్వరరావు, మల్లాడి శ్రీనివాసరావు, భైరవస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన రాయపురెడ్డి సత్యనారాయణ–శిరీష దంపతులు శుక్రవారం రూ.10,116 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందించారు. దాత కుటుంబానికి ట్రస్టు బోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు, ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా మాస కల్యాణం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి మాస కల్యాణాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన స్వామి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈఓ కృష్ణ చైతన్య మాట్లాడుతూ స్వామి వార్ని అన్నసమారాధన పథకానికి నందిగామకు చెందిన కల్కియోగ ట్రస్టు వ్యవస్థాపకుడు వై.పవన్ రూ.10,116 విరాళం అందించినట్లు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

వరినాట్లు త్వరగా పూర్తి చేయాలి

అయినవిల్లి: వరినాట్లు త్వరగా పూర్తి చేయాలని రైతులకు ఏడీఏ ఎంఏ షంషీ సూచించారు. శుక్రవారం అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏఏబీ చైర్మన్ కాకిలేటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఏడీఏ ఎంఏ షంషీ, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు హాజరయ్యారు. షంషీ మాట్లాడుతూ వరినాట్లు ఆలస్యం చేయడం వరి దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. తెగుళ్లు, పురుగులు బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. అలాగే జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులందరూ ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వై.శోభ, ఇరిగేషన్ ఏఈ మౌనిక, వ్యవసాయ విస్తరణాధికారి పి.మధుకుమార్ తదితరులు ఉన్నారు.

‘పల్లెకు పోదాం’లో పథకాల ప్రచారం

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో శుక్రవారం బీజేపీ శ్రేణులు పల్లెకు పోదాం కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కేంద్ర బీజేపీ అధిష్టానం ఆదేశాలతో దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రవాస్ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేసేలా పై కార్యక్రమం చేపట్టినట్టు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ తెలిపారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటా పథకాలపై రూపొందించిన బ్రోచర్‌లను ఇచ్చి, పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనారు.

మహిళలకు బాసటగా సీఎం జగన్

- వైఎస్సార్ ఆసరా కింద రూ.15.02 కోట్ల పంపిణీ
- ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న డ్వాక్రా సంఘాలు
- మహిళలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి భరోసా



చొప్పెల్లలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్రంలోని మహిళలందరూ ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అత్యంత వ్యయ ప్రయాసల కోర్చి గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం క్రింద నాలుగు విడతల్లో పూర్తిగా రూ.219.60 కోట్లు మేర డ్వాక్రా రుణమాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్ మహిళలకు బాసటగా నిలిచారని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని చొప్పెల్లలో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ ఆధ్వర్యంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.15.02 కోట్లు రుణమాఫీ మంజూరు పత్రాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మహిళల సంక్షేమ కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం జగన్ మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. నాటి టీడీపీ పాలనలో అన్నిరంగాల్లో దగా పడిన మహిళలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. మాజీ సీఎం చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. ఇప్పటికే మండలంలోని 1652 డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతలుగా రూ.60.08 కోట్లు పంపిణీ చేసిన విషయాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గుర్తు చేశారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మహిళల హర్షధ్వానాల మధ్య ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ప్రకటించారు. ఎంపీడీఓ ఎ.మేరీరోజ్,, ఏపీఎం ఎం.ధనరాజు, కార్యదర్శి శ్యామ్ సుందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కుల మత వర్గ వైషమ్యాలకు అతీతుడుగా ఉండటం వల్లే ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వరుస విజయాలు సాధిస్తున్నారని రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చోడిశెట్టి బాబి కొనియాడారు. అనునిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని, మహిళ సాధికారితకు తోడ్పాటును అందిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో అశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దియ్యన పెదకాపు, ఏజీపీ నామాల శ్రీనివాసు, మోటుపల్లి వెంకన్న, పెంటపాటి వెంకట్రావు, నల్లి రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చొప్పెల్లలో శుక్రవారం సుమారు రూ.లక్ష విలువైన కుక్కర్ల పంపిణీ జరిగింది. స్థానిక లక్ష్మీదేవి పుంత రోడ్డులో వైఎస్సార్ ఆసరా పథకం పంపిణీ కార్యక్రమం ఈసందర్భంగా ఆ సభకు హాజరైన మహిళలకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి లక్కీ డిప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కుటుంసభ్యుల చేతుల మీదుగా విజేతలైన 100 మందికి కుక్కర్లను అందజేశారు. అలాగే సభకు హాజరైన సుమారు పది వేల మందికి ఆత్మీయ విందును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ స్వర్ణలత



కొత్తపేటలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు



పి.గన్నవరంలో విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి ఉన్నీషా



ఆలమూరులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి భవానీశంకర్

కొత్తపేట: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే విద్యాభివృద్ధి సాధ్యమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన (డీ వార్మింగ్ డే) కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. అవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కళాశాల జువాలజీ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెద్దిరాజు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం అన్నింటికన్నా ముఖ్యమన్నారు. విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా చదువుకుని, ఉత్తమ ఫలితాలతో ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: అయిదేళ్ల పైబడి 16 ఏళ్లలోపు విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నగరం పీహెచ్‌సీ పరిధిలో 9,799 మంది పిల్లలకు గాను 9,594 మందికి డీ వార్మింగ్ మాత్రలు మింగించామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.స్వర్ణలత తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 16వ తేదీన మాత్రలు మింగిస్తారని చెప్పారు. మండలంలోని 18 గ్రామాల్లోను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి రియాజ్ ఉన్నీషా శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. జీహెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, శాంతామణి, శామ్యూల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ 98 శాతం పూర్తయింది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది మండలంలోని 61 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, రెండు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 76 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 19 ఏళ్లలోపు 11,963 మంది విద్యార్థులు, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం 11589 మందికి మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత వైద్యారోగ్య సిబ్బంది మాత్రలను మింగించారు. పెదపళ్ల పీహెచ్‌సీలో 5487 గాను 5402, చొప్పెల్ల పీహెచ్‌సీలో 6476 గాను 6187 మంది పిల్లలు ఈ సేవలను వినియోగించుకున్నారు. మిగిలిన విద్యార్థులు, చిన్నారులకు ఈనెల 17న మాత్రలను మింగిస్తామని వైద్యాధికారులు పేర్కొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



మొగలికుదురులో పర్యటిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

మామిడికుదురు: అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీర్వదించాలని జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు కోరారు. ఆయన శుక్రవారం మొగలికుదురు, బి.దొడ్డవరం గ్రామాల్లో పర్యటించారు. ప్రజల ఆశీర్వచనంతో జగనన్న తనను పి.గన్నవరం పార్టీ ఇన్‌చార్జ్‌గా నియమించారన్నారు. తనకు ప్రజల ఆశీస్సులు కావాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన వారికి తోడుగా, అండగా ఉంటానని వేణుగోపాలరావు చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా వచ్చేది జగన్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన జగనన్నకు ప్రజలు అండగా ఉన్నారన్నారు. ఎంత మంది ఏకమైనా వైఎస్సార్ సీపీకి ఢోకా లేదని వేణుగోపాలరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, పార్టీ నేతలు జక్కంపూడి తాతాజీ, నెల్లి దుర్గాప్రసాద్, తోరం సూర్యభాస్కర్, కడి అరుణకుమారి, కొప్పిశెట్టి దుర్గాపార్వతి, చెల్లు బోయిన రామశివసుబ్రహ్మణ్యం, కేదారిశెట్టి మల్లి, తాడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని చిట్టిబాబు సూచించారు. ఆస్పత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎంపీడీఓ త్రిశూలపాణి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, డాక్టర్లు అప్పారి సూర్యనారాయణ, చందన, శిరీష, యూడీసీ పల్లవి, రాణి, పంచాయతీ కార్యదర్శి కుంపట్ల పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల సమస్య పరిష్కారం



బడుగువానిలంకలో అర్హులకు పొజిషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో గత మూడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చొరవతో పరిష్కారమైంది. గ్రామంలో కొంతమంది లబ్ధిదారులకు ఇళ్లను నిర్మించుకున్న సంబంధిత పత్రాలు ప్రభుత్వం అందజేయకపోవడంతో ఇప్పటి వరకూ పలువురు పేదల ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వీరా రాజు, కర్రి నాగిరెడ్డి, దూలం సత్తిబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆ నేతలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి వివరించారు. దీంతో ఆయన సంబంధిత రెవెన్యూ అధికారులతో మాట్లాడి 36 మంది లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లను మండలంలోని చొప్పెల్లలో శుక్రవారం అందజేశారు. ఏళ్ల తరబడి నలుగుతున్న సమస్యలను ఉదారత భావంతో పరిష్కరించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి లబ్ధిదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో సీఎం జగన్ అందిస్తున్న సీఎం సహాయనిధి పేద ప్రజలకు ఒక గొప్ప వరమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలంలోని కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాపాక చేతుల మీదుగా సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం జగన్ అన్ని విషయాల్లో అండగా ఉంటున్నారని అన్నారు. గతం కంటే సీఎం సహాయనిధి పంపిణీ మొత్తాన్ని కూడా పెంచిన ప్రభుత్వం ఇదేనని అన్నారు. ప్రజలు బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో మరొకసారి జగన్‌నే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుందర తాతాజీ, దూది సాయిబాబు, మోకా ఉదయ్, బన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్నేహభావం పెరగాలి



సామూహిక భోజనాలు చేస్తున్న విద్యార్థులు

రావులపాలెం: విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందేలా సామూహిక భోజనాల కార్యక్రమం నిర్వహించినట్టు స్థానిక సిద్ధార్థ పాఠశాల డైరెక్టర్ కె.ముల్లారావు అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన సామూహిక భోజనాల కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు అందరూ ఒకచోట చేరి వాళ్లకు పాఠశాలలో ఉన్న అనుబంధాన్ని తీపి జ్ఞాపకాలను తలుచుకుంటూ వరుసగా కూర్చుని భోజనాలు చేశారు. డైరెక్టర్ ముల్లారావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల మధ్య సఖ్యత, స్నేహబంధాలు మంచి క్రమశిక్షణ అలవడడానికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొమ్మిది మద్యం బాటిళ్ల స్వాధీనం

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం ఓ వ్యక్తి వద్ద తొమ్మిది అక్రమ మద్యం బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన నల్ల తాతారావు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు గుర్తించారు. అతని నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భూసర్వే పనుల పరిశీలన



నార్కెడిమిల్లిలో రెవెన్యూ అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

ఆత్రేయపురం: మండలంలోని నార్కెడిమిల్లి, మెర్లపాలెం గ్రామాల్లో శుక్రవారం కొత్తపేట రెవెన్యూ డివిజినల్ అధికారి ఎం.సత్యనారాయణ పర్యటించారు. ఆ గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ సమగ్ర భూ సర్వే పనులు, సర్వే రాళ్ల ప్లాంటేషన్ పనులను స్వయంగా పరిశీలించి రెవెన్యూశాఖ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం ర్యాలి వెళ్లి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎనిమిది పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అలాగే ఆత్రేయపురం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరల్, బూత్ లెవెల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలపై కూలంకషంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అవార్డు సాధించడం అభినందనీయం



ఆలమూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద లైన్‌మెన్ శ్రీనివాసును సత్కరిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

ఆలమూరు: విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలను అందించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డులు సాధించడం అభినందనీయమని రామచంద్రపురం ట్రాన్స్‌కో ఎస్ఈ వై.విజయానంద్ అన్నారు. ఆలమూరులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ వై.లక్ష్మి ఆధ్వర్యంలో ఇటీవల రిపబ్లిక్ డే పురస్కరించుకుని ఇటీవల ఉత్తమ అవార్డును స్వీకరించిన లైన్‌మెన్ పిల్లి శ్రీనివాసుకు శుక్రవారం అభినందన సభ జరిగింది. విద్యుత్ ఉద్యోగులంతా లైన్‌మెన్ శ్రీనివాసుకు దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి మెమెంటో బహూకరించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు గంటి శ్రీనివాసు, ఎస్‌కె బషీర్, కొత్తపల్లి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త ఆరోగ్యంపై ఎమ్మెల్యే శ్రద్ధ



కార్యకర్త విజయకుమార్‌కు చికిత్స చేయిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: సఖినేటిపల్లి మండలం వీవీ మెరక గ్రామ వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంజేటి విజయ్ కుమార్ శుక్రవారం మలికిపురంలో గుండెపోటుకు గురయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు హుటాహుటిన విజయ కుమార్‌ను దగ్గరుండి మలికిపురంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి జాయిన్ చేశారు. వైద్యులతో మాట్లాడి పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు చెప్పడంతో వెంటనే అమలాపురం కిమ్స్ హాస్పిటల్‌కి ఎమ్మెల్యే రాపాక దగ్గరుండి తరలించారు. అక్కడి వైద్యులతో కూడా ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి మెరుగైన చికిత్స చేయిస్తున్నారు.

ఆదుకోవాలన్న ఆలోచన ఉన్నతమైంది

సఖినేటిపల్లి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్న ఆలోచన ఉన్నతమైందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం గుడిమూలలో అనారోగ్యంతో బాధపడుతున్న గేదెల రూపస్‌కు రత్నా చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన నగదు రూ.10 వేలను ఎమ్మెల్యే రాపాక చేతుల మీదుగా అందజేశారు. పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా, సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, కోన ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా పుల్లారావు



ముత్యాల పుల్లారావు

ఆలమూరు: మండలంలోని మోదుకూరు పీఏసీఎస్ చైర్మన్‌గా ముత్యాల పుల్లారావు నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీబీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పనిచేసిన నల్లి రాజు రాజీనామా చేయడంలో ఏర్పడిన ఖాళీని పుల్లారావుతో భర్తీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి చైర్మన్ ముత్యాలరావు కృతజ్ఞతలు తెలియజేశారు. పీఏసీఎస్ పరిధిలోని మోదుకూరు, గుమ్మిలేరు గ్రామ సర్పంచ్‌లు పెంటపాటి శ్యామల, గుణ్ణం రాంబాబు అభినందనలు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

పి.గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం 200 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుడు అప్పారి సూర్యనారాయణ, నాయకులు కోరుకొండ జాన్, నల్లా పెదకాపు, రావూరి సత్యనారాయణ, నేలపూడి రామకృష్ణ, నల్లా శివరామకృష్ణ, గుర్రం అయ్యప్ప, కొమ్ముల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ పంపిణీపై అవగాహన

అయినవిల్లి: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉజ్వల ఉచిత గ్యాస్ పంపిణీపై వీరవల్లిపాలెంలో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెరంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలకు ఉజ్వల ఉచిత గ్యాస్ పంపిణీ చేశారు.

మాజీ ప్రధాని పీవీకి భారతరత్నపై హర్షం

కొత్తపేట: మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడంపై రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకుడు, స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధానమంత్రిగా పనిచేయడమే కాక గొప్ప ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆయన మన తెలుగు వారు కావడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ముసునూరి కృతజ్ఞతలు తెలియజేశారు.

పేదల ఆరోగ్యానికి అండ సురక్ష

మలికిపురం: మండలంలోని ఇరుసుమండలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని సురక్ష శిబిరం ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వల్ల అందరికీ ప్రయోజనం చేకూరుతుందని ఉచిత మందులు, వ్యాధి నిర్ధారణకు పరీక్షలు మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని అందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, సర్పంచ్ వలవల అమ్మాజీ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, డాక్టర్స్ ఆర్.సాయిబాబు, పి.సుస్మిత, కె.రత్నసుధాకర్, బి.చరిస్మా సూపర్‌వైజర్లు ఎ.చంటి, నరసింహారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు బాబూరావు, వలవల రమేష్, సచివాలయ సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.